# ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు-విద్యా, ఉద్యోగావకాశాలను కల్పించటం ఓ మిథ్య

**పార్లమెంటు** శీతాకాల సమావేశాలు ముగిసే సమయంలో, అగ్రకులాలు, ముస్లిములు, క్రిస్టియనులుగా రిజర్వేషన్ విభాగంలోలేని వారందరికీ ఉన్నత విద్యలోనూ, ప్రభుత్వ ఉద్యోగావకాశాలలోనూ 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నరేంద్రమోడి ప్రభుత్వం 124వ రాజ్యాంగ సవరణ చేసింది.

ఎంతవేగంగా ఈ పరిణామాలన్నీ జరిగాయో పరిశీలిస్తే ఆశ్చర్యం కల్గుతుంది. పదిశాతం రిజర్వేషన్ కల్పించే ఈ రాజ్యాంగ సవరణ బిల్లు జనవరి 8వ తేదీన లోక్‌సభ ఆమోదం పొందింది. జనవరి 9వ తేదీన రాజ్యసభ ఆమోదం పొందింది. జనవరి 12న రాష్ట్రపతి ఆమోదముద్ర పడింది. జనవరి 14న కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని గెజిట్‌లో పేర్కొంది. అయితే ఇంతే వేగంగా ఈ రిజర్వేషన్ చట్టాన్ని సవాల్‌చేస్తూ సుప్రీంకోర్టు ముందుకు, వివిధ రాష్ట్రాల హైకోర్టుల ముందుకు అనేక వాజ్యాలు కూడా వచ్చాయి. పార్లమెంటు ఈ చట్టాన్ని ఆమోదించిన గంటల వ్యవధిలోనే 'యూత్ ఫర్ ఈక్వాలిటీ' అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ మొదటి కేసు నమోదు చేసింది. లోక్‌సభలో ముగ్గురు సభ్యులు, రాజ్యసభలో ఏడుగురు సభ్యులు మినహాయించి పార్టీలకతీతంగా పార్లమెంటు సభ్యులంతా ఈ బిల్లుకు అనుకూలంగా ఓటు వేశారు.

ఆర్థిక వెనుకబాటుతనానికి ప్రాతిపదికను గుర్తిస్తూ ప్రభుత్వం పేర్కొన్న ప్రాతిపదిక ఇలా వుంది: కుటుంబ ఆదాయం 8 లక్షల రూ॥లోపు వుండాలి; 5 హెక్టార్లు (12.5ఎకరాల) లోపు వ్యవసాయ భూమి కలిగి వుండాలి; వెయ్యి చదరపు అడుగులకంటే తక్కువ విస్తీర్ణంలో ఇల్లు కలిగివుండాలి; మున్సిపల్ ప్రాంతాలలో 109 చదరపు గజాలకు లోబడి నివాసగృహంకానీ, నోటిఫైచేయని మునిసిపల్ ప్రాంతాల్లో 209 చదరపు గజాల నివాసగృహం కానీ కలిగివుండాలి. ఈ నిబంధనలకు లోబడిన వారికి ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ వర్తిస్తుంది. ఈ ప్రాతిపదికన భారత దేశంలోని 96 శాతం జనాభా ఈ రిజర్వేషన్ పరిధిలోకి వస్తారు.

మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలలో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలలో అగ్రకులాలవారి ఓట్లు పొందలేకపోవటంతో తన పరపతిని తిరిగి పెంచుకునే చర్యలలో భాగంగా బిజెపి ఈ చట్టం చేసింది. భారతీయు లందరికీ సమాన విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రయత్నం ఏమాత్రం కాదిది. రానున్న ఎన్నికల దృష్టితో అగ్రకుల హిందువులను సంతృప్తి పరిచేందుకు చేపట్టిన చర్య మాత్రమే.

దేశంలోని వివిధ ప్రాంతాలలో అగ్రకులాలను అదేవిధంగా ఆధిపత్య రైతాంగ కులాలను ఆకర్షించటానికి బిజెపి ప్రయత్నించింది. తమ కులాలకు రిజర్వేషన్లు కావాలని ఇప్పటికే ఆందోళన చేస్తున్న గుజరాత్‌లో పటేళ్ళను, మహారాష్ట్రలో మరాఠాలను, ఆంధ్రప్రదేశ్‌లో కాపులను బుట్టలో వేసుకునే ప్రయత్నం చేసింది. ఆర్థికంగా వెనుకబడిన విభాగాలకు (ఇడబ్ల్యుఎస్) రిజర్వేషన్లు కల్పిస్తున్నామంటూ మరోవైపున బిజెపి తన రాజకీయ ప్రత్యర్థులకు, పాలకవర్గ పార్టీలకు ఒక సవాల్‌ను విసిరింది. విపక్షంలోనున్న పాలక వర్గ పార్టీలన్నీ కొంత నసిగినప్పటికీ, రాజ్యాంగ సవరణకు సమర్థనగా నిలిచారు. కాకపోతే, ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించేందుకు బిజెపి చేపట్టిన మోసపూరిత ఎత్తుగడ అనే విమర్శలకు మాత్రమే పరిమితమయ్యారు.

అనేక సామాజిక అంశాలపైన చాలా సాదాగా అవును, కాదు, నలుపు లేదా తెలుపు అనే విధంగా తేల్చి చెప్పటం సాధ్యంకాదు. మొత్తం వ్యవస్థలో భాగంగా దానికి పరిశీలించాల్సి వుంటుంది. భారత రాజ్యాంగం ద్వారా యస్‌సి, యస్‌టిలకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. శతాబ్దాలుగా వివక్షాపూరితమైన కులవ్యవస్థ ద్వారా ఈ సమూహాలు సామాజిక, ఆర్థిక వెనుకబాటు తనానికి గురయ్యాయనే దృక్పథంతోనే ఈ రిజర్వేషన్లు కల్పించారు. ఆర్థికంగా, సామాజికంగా ఆధిపత్య కులాలతో, విభాగాలతో సరితూగగల స్థితి వచ్చేంతవరకు కొంత కాలం వారిపై ప్రత్యేక శ్రద్ధ, సహాయం అవసరమని భావించారు. కొన్ని రాష్ట్రాలలో కేంద్రం కంటే ముందుగానే ఓబిసిలకు రిజర్వేషన్లు అమలు చేసినప్పటికీ, మండల్ కమీషన్‌తో దేశవ్యాపితంగా అమలయ్యాయి.

ఉద్యోగాలలో రిజర్వేషన్లనేవి ఏనాడూ నిజమైన స్ఫూర్తితో అమలుకాలేదు. కేవలం గత రెండు దశాబ్దాలుగా దీనిలో కొంత మార్పు కనబడుతోంది. రాజ్యాంగాన్ని ఆమోదించుకొని ఏడు దశాబ్దాలు గడిచిన తర్వాత కూడా సార్వజనీన అక్షరాస్యత అన్న నినాదం అమలుకు నోచుకోలేదు. జనాభాలో దాదాపు సగానికి కొంచెం తక్కువమంది ఇంకా నిరక్షరాస్యులుగానే వున్నారు. ఇక విద్యా నాణ్యత గురించి మాట్లాడనవసరమే లేదు. ఈ విద్య ద్వారా పిల్లలు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని, ఉద్యోగం పొందగలుగుతారన్న ఆశే లేదు. అత్యధిక సంఖ్యలోని యస్.సి., యస్.టి. జనాభాకు అదేవిధంగా రిజర్వేషన్ లేని విభాగంలోని అధిక సంఖ్యాక ప్రజానీకపు పురోభివృద్ధికి అవకాశమే లేకుండా పోయింది.

దేశంలోనూ, వివిధ రాష్ట్రాలలోనూ వరుసగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాల వైఫల్య ఫలితమే ఈ పరిస్థితి. ఈ పరిస్థితి రెండువైపులా అనగా రిజర్వేషన్ పొందుతున్న, రిజర్వేషన్ పొందలేని వారి ఇరువురిలోనూ అసమ్మతి, అసంతృప్తిలు పెరగటానికి కారనమైంది. రిజర్వేషన్ విభాగంలోని వారు తమ హక్కులు నిరాకరించబడుతున్నాయని భావిస్తూ వుండగా, రిజర్వేషన్ విభాగంలో లేనివారు తమ అవకాశాలను 'వేరెవరో' ఎగరేసుకుపోతున్నారని భావిస్తున్నారు. రిజర్వేషన్లలో వర్గీకరణ చేపట్టాలని; యస్‌సి, యస్‌టి, ఓబిసిల జాబితాలో తమతమ కులాల, సమూహాల పేర్లను అదనంగా చేర్చాలని; ఆర్థికంగా వెనుకబడిన అగ్రకులాల వారికి రిజర్వేషన్లు కల్పించాలని – తదితర వివిధ రకాల డిమాండ్లు ఈ పరిస్థితి నుండి ఉత్పన్నమైనవే.

ప్రస్తుతం ఉనికిలోవున్న సామాజిక ఆర్థిక వ్యవస్థను అనగా అర్థఫ్యూడల్, అర్థవలస వ్యవస్థను యథాతథంగా కొనసాగించేందుకు, కులవిభజనను సమాజంలో మరింత సుస్థిరం చేసేందుకు పాలకవర్గ పార్టీలు ఈ పరిస్థితినో తమకనువుగా ఉపయోగించుకొని భావోద్వేగాలను రెచ్చగొడు తున్నాయి. రాజకీయ పరపతి పెంచుకోవటం, ఓట్లు లబ్ధిపొందటమనే ప్రయోజనాలను ఈ క్రూరమైన క్రీడద్వారా వారు సాధించుకుంటారు. 2014లో యుపిఏ ప్రభుత్వం జాట్లను ఓబిసిలుగా గుర్తించి వారి కులానికి 5 శాతం కోటా రిజర్వేషన్లు కల్పించింది. దీనిని సుప్రీంకోర్టు కొట్టివేసింది. రాజస్థాన్, గుజరాత్‌లలో గుజ్జర్లకు బిజెపి ప్రభుత్వాలు రిజర్వేషన్లు కల్పించాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత మహారాష్ట్రలో బిజెపి ప్రభుత్వం మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించింది. కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన విభాగానికి రిజర్వేషన్లు (ఇడబ్ల్యుఎస్) కల్పిస్తూ చట్టంచేసిన తర్వాత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి 10 శాతం ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లలో సగం (5 శాతం) కాపులకు కేటాయిస్తున్నట్లు ప్రకటించాడు. కనుక, ఈ క్రీడ ఇలా సాగుతూ వుంటుంది.

విద్యారంగంలో రిజర్వేషన్లు అనేవి ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఉన్నత విద్యా సంస్థలకు మాత్రమే వర్తిస్తాయి. ప్రైవేటు విద్యాసంస్థలు రిజర్వేషన్లు అమలుచేయాలి. అయితే రిజర్వేషన్ల ద్వారా దీనిలోకి ప్రవేశం పొందితే ఆ విద్యార్థులు, అదే విద్యకు ప్రభుత్వ విద్యాసంస్థలో చెల్లిస్తున్న దానికంటే అనేక రెట్లు అధికంగా డబ్బు చెల్లించాల్సి వస్తుంది. ఉన్నత విద్యను ప్రైవేటీకరించే విధానం శరవేగంతో ముందుకు సాగిపోతుంటే, సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు నిస్సహాయంగా మిగిలి పోతారు. ఇంటర్మీడియట్, ప్రాథమిక విద్యలు ఇప్పటికే పూర్తి విస్మరించబడ్డాయి.

మరోవైపున ఉద్యోగాలలో రిజర్వేషన్లు ప్రభుత్వ రంగానికి మాత్రమే పరిమితం చేశారు. మొత్తం కార్మికుల సంఖ్యలో సంఘటిత రంగంలోని ఉద్యోగులు 10 శాతం కంటే తక్కువగా వున్నారు. కేంద్రప్రభుత్వ, రాష్ట్రప్రభుత్వాల ఆధ్వర్యంలోనూ ప్రైవేటురంగంతో సహా ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థలన్నీ సంఘటితరంగం కిందకే వస్తాయి. ఈవిధంగా దీనిలో రిజర్వేషన్లు కేవలం 5 శాతం ఉద్యోగాలకు మాత్రమే వర్తిస్తాయి. అది కూడా రోజురోజుకీ కుదించుకుపోతూవుంది. గత నాలుగు సం॥ల కాలంలో ప్రభుత్వరంగ సంస్థలలో ఉద్యోగాలు 13 శాతం తగ్గిపోయాయి. 2014 సం॥లో 16.9 లక్షలుగా వున్న ఉద్యోగాలు 2018 నాటికి 14.7 లక్షలకు తగ్గిపోయాయి. రానున్న మూడు సం॥ల కాలంలో రైల్వేలలో ఖాళీగా వున్న 2 లక్షల ఉద్యోగాలను భర్తీచేస్తామని రైల్వేమంత్రి ప్రకటించాడు. దీనికి మరో పార్శ్వం ఏమంటే, చెప్పినవిధంగా ఈ ఖాళీలన్నింటిని భర్తీచేసినప్పటికీ, మూడు సం॥ల తర్వాత కూడా మరో రెండు లక్షల ఖాళీలు రైల్వేలలో వుంటాయి. ప్రతి సంవత్సరం రైల్వేలలో 60 వేలమంది ఉద్యోగ విరమణ చేస్తున్నారు. నరేంద్రమోడీ తమ ప్రభుత్వం ప్రతి ఏటా కోటి ఉద్యోగాలను కల్పిస్తుందని ప్రకటించాడు. భారత ఆర్థికవ్యవస్థ పర్యవేక్షణా కేంద్రం (సిఎమ్ఐఇ) గణాంకాల ప్రకారం కేవలం ఒక్క 2018 సం॥లోపూ 1 కోటీ 10 లక్షలమంది తమ ఉద్యోగాలను కోల్పోయారు. ఎన్ఎస్ఎస్ఓ అధ్యయనం ప్రకారం, గత 45 సం॥ల గరిష్టానికి నిరుద్యోగిత పెరిగింది. అయితే కేంద్రప్రభుత్వం ఈ నివేదికను బయటకు విడుదల చేయటానికి నిరాకరించింది. వ్యవసాయరంగం, ఉత్పాదకరంగాలలో పెద్ద నోట్లరద్దు, జిఎస్‌టిల కారణంగా ఉద్యోగావకాశాలు కుదించివేయబడిన పరిస్థితి, మూడు సం॥ల తర్వాత కూడా కోలుకో లేదని ఆ నివేదిక తెలిపింది.

పాలకవర్గాలు ఆడే ఆటలో ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల కల్పన గొప్ప ఎత్తు. రిజర్వేషన్లు పొందని వారిలో 96 శాతం మంది ఈ కోటా కింద అర్హులుగా వుండేవిధంగా ఇడబ్ల్యుఎస్‌కు అర్హులను నిర్ణయించే ప్రాతిపదికను రూపొందించారు. ఆచరణలో ఓ.సి. విభాగంలో మార్కులు అధికంగా సాధించినవారే అర్హులుగా వుండబోతున్నారు. ఇది రిజర్వేషన్లు అనే దాని అవగాహనకే అపహాస్యం చేయటంతోపాటు, నిరుద్యోగులైన యువజను లందరినీ దగా చేయటమే.

ఏడు దశాబ్దాల 'స్వాతంత్ర్యం' తర్వాత, ప్రభుత్వరంగంలోని విద్యా, ఉద్యోగావకాశాలలో కల్పించిన రిజర్వేషన్లు యస్‌సి, యస్‌టి ప్రజానీకపు విద్యాపరమైన, ఆర్థికపరమైన స్థితిగతులను, చేరుకోవలసిన మెరుగైన స్థాయికి చేర్చలేక పోయాయి. ఓబిసిల రిజర్వేషన్ల పరిస్థితి కూడా అంతే. విద్యా, ఉద్యోగావకాశాలను కల్పించే తమ బాధ్యత నుండి వరుసగా అధికారంలో కొనసాగే ప్రభుత్వాలన్నీ తప్పుకుంటూ వుంటే – అదికూడా విద్యాహక్కు చట్టం, ఉద్యోగహక్కు చట్టాల నడుమ నుండే – అన్ని విభాగాల, కులాలకు చెందిన యువజనులందరైై హుందా అయిన పద్ధతుల్లో విద్యావంతమై, ఉద్యోగం సంపాదించుకోగలుగు తారనే ఎలాంటి ఆశా లేదు. దట్టంగా కమ్మిన ఈ పొగమంచులో నుండే యువజనులు పరిస్థితులను పరిశీలించి, లేని ఉద్యోగావకాశాల పేరిట తమలోనే ఒక విభాగాన్ని మరొక విభాగంపైకి ఎగదోసే మోసపూరితమైన పాలక వర్గాల, పాలక రాజకీయపార్టీల పన్నాగాలను అర్థంచేసుకోవాలి.

ప్రస్తుతం ఉనికిలోవున్న సామాజిక వ్యవస్థ ప్రజలందరికీ గౌరవప్రదమైన జీవనోపాధిని కల్పించగలిగిన పరిస్థితిలో లేదని గత ఏడు దశాబ్దాల అనుభవం స్పష్టంగా తేటతెల్లంచేస్తోంది. గ్రామీణ ప్రాంతంలో కొనసాగుతున్న ఫ్యూడల్ సంబంధాలు వ్యవసాయం, గ్రామీణ ప్రజానీకపు అభివృద్ధికి ఆటంకంగా వున్నాయి. ఆర్థిక వ్యవస్థలోని అన్ని విభాగాల ప్రజానీకపు శ్రమ ద్వారా సృష్టించబడిన సంపదనంతా సామ్రాజ్యవాద దేశాల బహుళజాతి సంస్థలు, గుప్పెడుమందిగా వున్న భారత బడా బూర్జువావర్గ కుటుంబాలు చేజిక్కించుకుంటూ, అత్యంత కొద్ది విభాగాన్ని మాత్రమే అశేష ప్రజానీకానికి మిగులుస్తున్నాయి. భారతదేశంలో పేదరికానికి, తద్వారా వివిధ సమూహాల, కులాల వెనుకబాటుతనానికి ఇదే వాస్తవిక కారణం. ఫ్యూడల్ సంబంధాలను బ్రద్దలుకొట్టి, దున్నేవానికే భూమి కల్పించి, భారత దేశంపై భారత ఆర్థికవ్యవస్థపై సామ్రాజ్యవాదుల ఆధిపత్యాన్ని కూలదోయగలిగినప్పుడు మాత్రమే ప్రజలు తమ జీవితాలలో నిజమైన అర్థంలో అభివృద్ధిని సాధించగలుగుతారు

౦౦౦౦